

# నవభూమి
## పాలమూరు
అనుబంధం

04 ఏప్రిల్,2025 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


### జానంపేట రామసముద్రం చెరువుకు సంబంధించి

# అన్ని రికార్డులు పరిశీలన

- మునిగిన తమ భూములకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలి
- పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశం
- తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** జిల్లాలోని శ్రీరంగాపురం మండల పరిధిలోని జానంపేట రామసముద్రం చెరువుకు సంబంధించి అన్ని రికార్డులు పరిశీలించిన తర్వాత లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శ్రీరంగాపురం మండల పరిధిలోని జానంపేట చెరువు నీటి వల్ల తమ భూములు మునుగుతున్నాయని, మునిగిన తమ భూములకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలంటూ చెరువు ఆయకట్టు రైతులు ఇదివరకు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో లోకయుక్త కు నివేదిక సమర్పించడం కొరకు జిల్లా కలెక్టర్ గురువారం అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడికి వచ్చిన జానంపేట గ్రామ రైతులు, పిటిషన్ దారులతో మాట్లాడి, పరిస్థితులను తెలుసుకున్నారు. చెరువు నీటి వల్ల మునుగుతున్న తమ భూముల సమస్య గురించి రైతులు కలెక్టర్ కు విన్నవించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డుదారులు సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలి పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతోనే, ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని రెండవ నెంబర్ రేషన్ దుకాణాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం తో కలిసి సందర్శించి, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం రేషన్ దుకాణంలో ఉన్న స్టాక్ రిజిస్టర్, బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. బియ్యం తీసుకోవడానికి వచ్చిన స్థానికులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇకనుంచి ప్రతి నెల తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, సి సెక్షన్ సూపర్డెంట్ కిషన్, శ్రీరంగాపూర్ డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, గ్రామస్థులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





### సమస్యలపై చర్చించుకోవాల్సిన సమయం

# ఆసన్నమైంది.!



**మహబూబ్ నగర్ నవభూమి:** రెవెన్యూ ఉద్యోగులుగా మనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మనం కోరుకుంటున్న సంక్షేమం, ఇతర శాఖాపరమైన పదోన్నతులు, బదిలీలు, సీనియారిటీ అంశాల గురించి మనమంతా ఒక చోట కలిసి చర్చించుకోవాల్సిన సందర్భం, సమయం ఆసన్నమైందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ-గద్వాల, నారాయణపేట జిల్లాల రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో భాగంగానే రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకుని మనందరం ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. భూసమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. ఆప్షన్ల పద్ధతిలో జీపీవో నియామకాలు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ సాధించిన విజయం అన్నారు. ఆప్షన్ల ద్వారా రెవెన్యూశాఖలోకి వస్తున్న జీపీవో గ్రామ పరిపాలన అధికారులు సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదని, జీపీవోలందరికీ కామన్ సర్వీస్ ఉంటుందన్నారు. సమీప భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వేర్వేరు జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు తీసుకొచ్చేందుకు కృషిచేస్తునమన్నారు. 61 సంవత్సరాలకు పైబడిన వీఆర్వలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఉద్ఘాటించారు. వేర్వేరు జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. 330 మందిని అధికారికంగా అవుట్ సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించడం జరిగిందని, 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేటు యాజమాన్యం నుంచి ప్రభుత్వ కార్పోరేషన్‌కు బదిలీ చేసేందుకు శాయాశక్తుల కృషిచేస్తున్నామన్నారు. సంక్షేమ అభివృద్ధి పథకాల ఫలాలను లబ్దిదారులకు అందించేందుకు మనందరం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి వెంకట్రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్పాక, టీజార్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రాధ, సీసీఎస్ఏ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణచైతన్య, రాంబాబు, కోశాధికారి మల్లేషం, టీజీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షులు సుజాత చౌహాన్, టీజీటీఏ ఉపాధ్యక్షులు పాల్సింగ్, పూర్వపు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్రావు, మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మోహన్ రావ్, పేట అదనపు కలెక్టర్ బెంజ్యాలం, ఆర్డీవో నవీన్, డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి, ఉమ్మడి జిల్లా టీజీటీఏ అధ్యక్ష కార్యదర్శులు ఘాన్సీరామ్, ఇబ్రహీం, రమేశ్రెడ్డి, జిలానీ, వీరభద్రప్ప, నరేందర్, శ్రీకాంత్, కృష్ణయ్య, తబితా, వెంకటేశ్, టీజీఆర్ఎస్ఏ నాయకులు శ్రీనివాస్, దేవేందర్, చైతన్య, శ్యాంసుందర్రెడ్డి, లక్ష్మీకాంత్, ప్రశాంత్, రమేశ్, రాములు, కరుణాకర్, కిరణ్ కుమార్, బాలరాజు, రెవెన్యూ ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు



**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వనపర్తి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల, ఏప్రిల్ 01 నుండి 30 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు,సమావేశాలు,ఊరేగింపులు, ధర్నాలు,ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, రాజకీయ నాయకుల, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** భూస్వాములు, దొరల అరాచకాల నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు విరోచితమైన పోరాటం చేసిన వీరుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య హాజరై దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన దొడ్డి కొమురయ్య పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాల్సిన అవసముందని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో భాను ప్రకాష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ మధుమేహ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు జీవన విధానం నియమాలు చేయకూడదు

**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** మిషన్ మధుమేహ కార్యక్రమంలో భాగంగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు తమ జీవన విధానంలో పాటించాల్సిన నియమాలు, చేయకూడని పనుల గురించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను గురువారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లే శ్రీనివాసులు, ఎన్ సి డి రామచంద్రరావు, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పెబ్బేరు నూతన ఎస్సై గంగిరెడ్డి యుగంధర్ రెడ్డి



**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** గురువారం పెబ్బేరు ఎస్సై గంగిరెడ్డి యుగంధర్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పెబ్బేరు ఎస్సై గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జి.యుగంధర్ రెడ్డి వనపర్తి జిల్లా పెద్దమందడి పోలీస్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ పెబ్బేరుకు బదిలీపై వచ్చారు.పెబ్బేరు ఎస్సైగా పనిచేసిన హరిప్రసాద్ రెడ్డి వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తూ ఆయన ప్రజలను కోరారు.

## వనపర్తి జిల్లాలో గంజాయి .. కల్తీ కల్లు నిర్మూలన పోస్టర్ విడుదల

**వనపర్తి ఏప్రిల్ 03(వనపర్తి నవభూమి ప్రతినిధి):** వనపర్తి జిల్లా వ్యాప్తంగా గంజాయి, కల్తీ కల్లు నిర్మూలనకు సంబంధించి అవగాహన కల్పించేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో తరపున ప్రచార కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు గురువారం రోజు వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో వారు రూపొందించిన "గంజాయి, కల్తీ కల్లు నిర్మూలన" పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా నార్కోటిక్ బ్యూరో డిఎస్పీ మాట్లాడుతూ యువత, ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి. గంజాయి, కల్తీ కల్లు వంటి నిషేధిత పదార్థాల వినియోగం వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సమాజ పరంగా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఎవరైనా గంజాయి విక్రయం లేదా కల్తీ కల్లు తయారీ, సరఫరా, వినియోగానికి పాల్పడినట్లు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా వుంచబడును. మత్తు మందుల వ్యసనాన్ని నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డిఎస్పీ బుచ్చయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








## నూతన ఎస్సైని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన సన్మానం

### ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీ సేవలు అమూల్యమైనవి

### పెబ్బేరు ఎస్ ఐ జి.యుగంధర్ రెడ్డి



**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** పెబ్బేరు మండల నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన యుగేందర్ రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు గురువారం పెబ్బేరు పోలీస్ స్టేషన్లో ఎస్సైకి శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీ సేవలు అమూల్యమైనవని, ప్రజా సమస్యల పరిష్కారానికి న్యాయపరంగా కృషి చేయాలని ఎస్సైని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెబ్బేరు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలందరికీ న్యాయం చేస్తానని పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదారులకు సమన్వయం అందిస్తూ సమస్యలు పరిష్కరిస్తూ శాంతిభద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని అలాగే శాంతిభద్రతలకు మండల ప్రజలందరూ వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సన్మానించిన కాంగ్రెస్ నాయకులకు ఎస్సై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెబ్బేరులో సిమెంట్ లారీ ఢీ: వ్యక్తి మృతి



**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** ఇంటికి పెద్ద దిక్కై కార్పెంటర్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న 57 సంవత్సరాల వృద్ధుడికి రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. సిమెంట్ లారీ రూపంలో ఒకర్ని మృత్యువు కబళించింది. ఈ ఘటన పెబ్బేరు పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గరలో భవాని వైన్ షాప్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎస్ఐ యుగంధర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు వనపర్తి జిల్లా నాచహల్లి గ్రామానికి చెందిన విష్ణు చారి (57) వృత్తి కార్పెంటర్ పెబ్బేరు పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా దగ్గరలో భవాని వైన్ షాప్ సమీపంలో కొల్లాపూర్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా అదే దారిలో వెనుక వైపు నుంచి సిమెంటు లారీ ఎపి39యుసి7200 డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వల్ల విష్ణు చారికి ఎడమ చేయి ఎడమ కాలుకు తీవ్రగాయాలు అయినవి వెంటనే గాయపడిన వ్యక్తిని 108 ద్వారా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన తర్వాత మెరుగైన వైద్యం కొరకు గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో చనిపోవడం జరిగింది. విష్ణు చారి కూతురు శైలజ ఫిర్యాదు మేరకు కర్నూల్ కు చెందిన లారీ డ్రైవర్ షైక్ దాదావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పెబ్బేరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి 8 నామినేషన్లు

**వనపర్తి ఏప్రిల్ 03(నవభూమి ప్రతినిధి):** పెబ్బేరు : పెబ్బేరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో జిల్లా ఎన్నికల సంఘం నాయకులు గురువారం నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. అందులో భాగంగా మొత్తం 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. బిలకంటి విజయుడు, దేవరశెట్టి మహేష్, భీమ్ శెట్టి రవికుమార్, నరహరి రాజశేఖర్, రాజా నవీన్ కుమార్, భీమ్ శెట్టి శ్రీనివాస్, సంబు రమేష్ కుమార్, దేవరశెట్టి శంకర్ లు నామినేషన్లు వేశారు. 5వ తేదీ నామినేషన్లు ఉపసంహరణ, 13న ఎన్నికలు అదేరోజు ఫలితాలు వెల్లడించనున్నామని ఎన్నికల నిర్వాహకులు సింగయ్య శెట్టి, బాదం వెంకటేశ్వర్లు, బుస్స రమేష్ తెలిపారు.



## సన్నబియ్యం సంచుల్లో దొడ్డు బియ్యం.. అవాక్కైనా లబ్ధిదారులు



**వెల్దండ, నవభూమి :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం ఆదిలోనే అభాసుపాలైంది. రేషన్ షాపులో సన్న బియ్యం సంచిలో దొడ్డు బియ్యం ప్రత్యక్షం కావడం రేషన్ లబ్ధిదారులను ఆశ్చర్యానికి గురిచేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని రేషన్ షాప్ నెంబర్ %-% 2లో మొదటిరోజు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తుండగా సన్న బియ్యం సంచిలో దొడ్డు బియ్యం రావడంతో అవి లబ్ధిదారుడు చిమ్ముల రవీందర్ రెడ్డి సంచిలో పోయగా అతను అభ్యంతరం వ్యక్తం చేస్తూ తిరిగి సన్న బియ్యం పోయించుకొని వెళ్ళాడు. దీంతో రేషన్ డీలర్ శ్రీనివాస్ దొడ్డు బియ్యం సంచిని పక్కకు పెట్టి అధికారులకు సమాచారం అందజేశారు. దొడ్డు బియ్యం ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి నప్పటికీ అధికారులు తిరిగి సన్న బియ్యం సంచిలో దొడ్డు బియ్యం పంపితే ఎలా పంపిణీ చేయాలంటూ రేషన్ డీలర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే లబ్ధిదారులచే తమకు చాలా ఇబ్బంది ఉంటుందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్లు, లబ్ధిదారులు కోరుతున్నారు.

## హెచ్‌సీయూ భూముల వేలం తక్షణమే విరమించుకోవాలి




**మాగనూరు నవభూమి:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని తక్షణమే విరమించుకోవాలని నారాయణపేట జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు నయిమ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న మొండివైఖరికి నిరసనగా విద్యార్థుల నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను గురువారం మాగనూరు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ అక్రమ నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీలను బలోపేతం బదులు బలహీనపరిచే చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. యూనివర్సిటీ భూములను రక్షించాలని విద్యార్థులు ఉద్యమిస్తే వారిని పోలీస్ స్టేషన్లకు లాకెళ్లి నిర్బంధించడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సూర్య ప్రకాష్, అంబరీష్, తదితర నాయకులను అరెస్టు చేశారు.

## సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్ కర్నూల్ నవభూమి:** ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. నాగర్ కర్నూల్ మండలం గగ్గలపల్లి గ్రామంలో గురువారం సన్న బియ్యాన్ని పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీతో పేదల ఇళ్లల్లో సందడి నెలకొందని తెలిపారు. పేదలకు ఆర్థిక భారం తగ్గించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని వెల్లడించారు. రైతుల కష్టానికి గౌరవాన్ని కల్పించడంతో పాటు, పేద ప్రజలు ఆకలికి గురికాకుండా పోషకాహారాన్ని అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పథకం సజావుగా అమలవ్వాలని, బియ్యం పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలను సహించేది లేదని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు , ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఆర్డీవో , మండల నాయకులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి

**మహబూబ్‌నగర్ నవభూమి:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ సంస్థలకు అమ్మడం , అక్కడ ఉన్న జాతీయ పక్షి నెమళ్ళను, రాష్ట్ర జంతువు కృష్ణ జింకలను చంపుతున్న సీఎం రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలనీ పాలమూరు యూనివర్సిటీ బీఆర్ఎస్వీ కన్వీనర్(%దీ=చాం ఎశీఅజవఅవతీ% ) గడ్డం భరత్ బాబు, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు బత్తిని రాము డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు వేలం పెట్టి అమ్మడాన్ని నిరసిస్తూ పాలమూరు యూనివర్సిటీలో గురువారం ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి పచ్చని మణిహారంగా ఉండి స్వచ్ఛమైన గాలిని అందిస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అడవులను నెలమట్టం చేసి, 400 ఎకరాల యూనివర్సిటీ భూములను సీఎం రేవంత్ రెడ్డి కార్పొరేట్ సంస్థలకు అమ్మడం సిగ్గుచెటైనా చర్యని విమర్శించారు. బుల్డోజర్లతో యూనివర్సిటీ అడవులను చదును చేస్తుంటే అక్కడి పక్షులు,జంతువుల అరుపులు వినపడడం లేదా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూములను కాపాడాలని శాంతియుత నిరసనలు చేస్తున్న యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణహని అన్నారు. ఎన్నికల్లో సెంట్రల్ యూనివర్సిటీ చుట్టూ తిరిగిన రాహుల్ గాంధీకి హెచ్‌సీయూ భూముల కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటాలు కన్పించడం లేదా అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీ భూములను కేసీఆర్‌పరిరక్షించారని తెలిపారు. యూనివర్సిటీలో కొత్త భవనాలను కట్టడానికి స్థలం అవసరమైతే కావలసిన స్థలాన్ని రేవంత్ రెడ్డి ఎక్కడినుండి తెస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని రద్దు చేసేంతవరకు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ, లక్ష్మణ్ నాయుడు,రాజగోపాల్, రాము, కావేరి, చైత్ర, నవనీత, పూజిత, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను, కిరణ్, రామకృష్ణ రాముడు, కవిత, మాధవి, గీతాంజలి పాల్గొన్నారు .







## ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**అమరచింత, నవభూమి:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజీపేటలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ చేశారు. తిమ్మాజీపేటతోపాటు గొరిటలో బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. నిరుపేదలు కూడా నాణ్యమైన సన్న బియ్యంతో భోజనం చేయాలన్నది ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగానే ప్రతి తెల్ల రేషన్‌కార్డు దారునికి సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఆర్డీఓ సురేశ్, తాసిల్దార్ రామకృష్ణయ్య, ఆర్ఐ రవిచంద్ర, నాయకులు వెంకట్రాంరెడ్డి, దానం బాలరాజ్, మల్లయ్య గౌడ్, ముబారక్, నాగ సాయిలు తదితరులు పాల్గొన్నారు. పిన్నంచర్లలో..రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీని ఆత్మకూరు మండలంలోని పిన్నంచెర్లలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిమతుల్లా, మండల పార్టీ అధ్యక్షుడు పరమేశ్ ప్రారంభించారు. పేద ప్రజలకు మూడు పూటలా తిండి పెట్టే ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం అందిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిన్నం చర్ల మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, యువజన కాంగ్రెస్ నాయకులు మచ్చేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాములు, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

